# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# శుభ్ర జ్యోత్స్న

" శుభ్ర జ్యోత్స్న" గారు మొన్న వచ్చారుట దిలీప్ వాళ్ళింటికి " అంది ఒకరోజు నన్ను డిన్నర్ కి పిలిచినప్పుడు సురేష్ తో రేఖ.

ఆ పేరు!! వెయ్యిమందిలో ఒక్కరికీ కూడా ఉంటుందో, ఉండదో? ఆ పేరు రేఖ నోటివెంట రాగానే నన్ను నేను మర్చిపోయాను..

" శుభ్ర జ్యోత్స్న గారా?" ఆశ్చర్యంగా అడిగాడు సురేష్... ఆ పేరు వినగానే నాలో కలిగిన ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని కొన్ని క్షణాలే అయినా సరే దాచుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

" యా, దిలీప్ కొడుకు బారసాలకి తప్పక రావాలి అని పట్టుబడితే, అది కూడా తను వెళ్ళి, బ్రతిమాలి, తీసుకువస్తే వచ్చారుట." అంది రేఖ.

" శుభ్రజ్యోత్స్న"!! అది తాతగారు పెట్టిన పేరేనా?? .. నాన్న పేరు వైనతేయ, పెద్దత్త పేరు ' వింధ్యావళి' చిన్నత్త పేరు" శుభ్రజ్యోత్స్న". బాబాయ్ పేరు " వైశంపాయన".

మీకంత మంచి పేర్లు పెట్టారు తాతగారు, నాకు మాత్రం ఇలాంటి నిఖిత అని పేరు పెట్టారా? అని, నాన్నతో ఎన్నిసార్లు పోట్లాడిందో? ఆ విషయాలన్నీ ఎన్నిసార్లు గుర్తు చేసుకుందో? ఎప్పటికీ మర్చిపోలేదు.. ఇరవై ఐదేళ్ళుగా కనిపించని మనిషి, వినిపించని పేరు ఇప్పుడు ఒక్కసారిగా పలకరిస్తే తట్టుకోవడం కష్టంగానే ఉంది.. అది ఆనందమా, ఉద్వేగమా, మరేదేనైనా?

" నైస్!" అన్నాడు. సురేష్.. మొత్తానికి సాధించాడు దిలీప్. ఎవరివల్లా కానిది తను చేశాడు. ఆవిడ ఇల్లు కదలడమంటే మాటలా? " అన్నాడు.

వాళ్ళు మాట్లాడుకునేది వింటున్నాను కాని మనసంతా ఏదో తెలియని భావనతో నిండిపోయింది.

"ఆవిడని, నేనొకసారి కలవాలి అన్నాను" చప్పున. "కలవగలనా? కలవవచ్చా?" అన్నాను. నాలో నేను అనుకుంటున్నాను అనుకున్నాను కాని బయటకి అన్నాను అని అర్థం కావడానికి కొన్ని క్షణాలు పట్టింది.

' నిఖితా! ఎవరిని కలవాలంటున్నారు? శుభ్రజ్యోత్స్న గారినా? ఆవిడ మీకు తెలుసా?" అడిగాడు సురేష్.

" నాకు ఆ పేరు గల ఆవిడ ఒకరు బాగా తెలుసు..ఆవిడేమోనని అనుమానం వచ్చి అడిగాను."అన్నాను అప్పటికి తేరుకుంటూ.

" ఓ, తప్పకుండా, మీరు కావాలంటే వచ్చే వీకెండ్ వెళ్దాం. నేను తీసుకెళ్తాను" అన్నాడు సురేష్." ఆవిడ మీకు తెలిసినవారైతే కలవవచ్చు లేదంటే వెనక్కి వచ్చేద్దాం" అన్నాడు అతను.

ఆ మాటకి అతని పట్ల కృతజ్ఞతతో నా మనసు నిండిపోయింది.

మూడు వారాల బిజినెస్ ట్రిప్ మీద వచ్చాను అమెరికా కి. ఈస్ట్ కోస్ట్ నుంచి వెస్ట్ కోస్ట్ వరకూ ఉన్న క్లయింట్స్ లో కొందరితో మీటింగ్ లు అవుతున్నాయి, మరికొన్ని వచ్చేవారం ఉన్నాయి. నా సహోద్యోగి సురేష్, అతని శ్రీమతి రేఖా నన్నెంతో బాగా రిసీవ్ చేసుకోవడమే కాక ఎంతో బాగా చూసుకుంటున్నారు.

రేఖఅయితే ప్రతీ రోజూ నాకు లంచ్ కూడా తయారు చేసి పంపేది. వద్దన్నా వినదు. ప్రతీ రెండో రోజుకీ నన్ను ఇంటికి భోజనానికి పిలవడమో, లేదా ఏదైనా రెస్టారెంట్ కి తీసుకువెళ్ళడమో చేస్తున్నారు.., 'మూడున్నరేళ్ళ పాప వకుళతో అన్నీ నువ్వే చేసుకోవాలి. ఉన్న పనులు చాలనట్టు నా పని కూడా ఎందుకు" అంటే..

‘ మేము ఇదివరకు ఒమాహా లో ఉండేవాళ్ళం, అక్కడ మాకు చాలా కొద్దిమంది తెలిసినవాళ్ళు ఉండేవారు. అక్కడనించి ఈ మధ్యనే ఇక్కడికి మారాము. ఇక్కడికి వచ్చాకా మా ఇంటికి వచ్చిన మొదటి గెస్ట్ మీరు. పైగా ఒంటరిగా వచ్చారు, బోర్ కొడుతుంది. మన అనే వాళ్ళుంటే మన్యంలో కూడా బ్రతికేయచ్చు అని మా అమ్మమ్మ ఎప్పుడూ అనేది. అది ఎంత నిజమో నాకిక్కడికొచ్చాకా అనుభవం అవుతోంది అంటూ నవ్వి “ అందుకని మేమేం చేసినా మీరు కాదనకూడదు”అంటూ నన్ను మాట్లాడనివ్వలేదు. అలా ఈ రెండు వారాల్లోనూ ఎంతో దగ్గరయ్యారు వాళ్ళిద్దరూ.

భోజనం ముగించాకా నన్ను కార్ లో హోటల్ దగ్గర దింపారు. రాత్రి ఉండిపోమన్నా నేను ఉండలేదు. కారణం నాతో నేను గడపవలసిన సమయమది. ఆ పేరు నాలో రేపిన అలలు, వాళ్ళు చెప్పిన వివరాలు విన్నాకా రూఢి అయిన నిజాలు చాలు నన్ను ఈ రాత్రి జాగారం చేయించడానికి.

"శుభ్ర జ్యోత్స్న".. పేరంత అందంగా ఉండే చిన్న అత్తా ఈ శుభ్రజ్యోత్స్న? గత ముప్పై ఏళ్ళల్లో ఏనాడు తమ ఇంట్లో తలచుకోడానికి ఇష్టపడని, ఎవరూ మరిచిపోని పేరు అది..

" మాకెంత తమాషాగా పరిచయం అయ్యారో తెలుసా ? ఆవిడ. ఒకసారి వకుళ బాగా చిన్నపిల్లగా ఉన్నప్పుడు పరుగున వెళ్ళి ఆవికడ్డం పడింది వాల్ మార్ట్ లో. ఆవిడ పాపని చేతుల్లోకి తీసుకుని అటూ, ఇటూ చూసి మేము కనబడగానే మాకప్పగించేశారు. పొరపాటునైనా పలకరింపుగా కూడా నవ్వలేదు. అప్పుడే కొత్తగా వచ్చిన మాకు మన దేశపు వారిని చూస్తే ఎంతో ఆనందంగా ఉండేది. అందులో తెలుగు వాళ్ళని చూస్తే మరీనూ. ఆవిడ అప్రయత్నంగానే పాపని ముద్దు చేస్తూ తెలుగులో మాట్లాడడం మేం విన్నాం, కానీ ఆవిడెందుకో మాతో తెలుగు కాదు కదా, అసలు ఇంగ్లీష్ లో కూడా ఏమీ మాట్లాడలేదు. పొడిగా థాంక్స్ చెప్పి వెళ్ళి పోయారు. ఆ తర్వాత బ్రహ్మ ప్రయత్నం చేస్తే మాకూ, దిలీప్ అనే మా ఫ్రెండ్ కుటుంబాన్నీ అప్పుడప్పుడూ కలిసేవారు. లేదంటే ఆవిడ ప్రపంచంలో ఆవిడ ఉంటారు’ రేఖ మాటలు గుర్తొస్తూనే ఉన్నాయి నాకు..

నాకు ఎనిమిదేళ్ళుంటాయేమో అప్పుడు! ఇంట్లో జరిగిన గొడవ గుర్తుంది, దానికీ, ఆ తర్వాత అత్త ఇంట్లో కనబడకపోవడానికీ సంబంధం ఉందనీ అర్ధం అయింది. కానీ అదేమిటి? అనేది అర్ధం కాలేదు. తాతగారూ , నాన్నమ్మా చెప్పలేరు. నాన్నా, అమ్మా చెప్పరు..

" అది చేసిన పని తలుచుకుంటేనే నాకు వళ్ళంత కంపరం ఎత్తినట్టవుతుంది. ఇంత పరువుగల కుటుంబంలో పుట్టి ఎలాంటి పని చేసింది? ఈ పాపం ఊరికే పోదు?" అమ్మా, పెద్దమ్మా మాట్లాడుకుంటూ ఉంటే వినబడేవి. చిన్నవయసులో తెలియకపోయినా తర్వాత తేలిగ్గానే అర్ధం అయింది... కానీ ఎలాఉందో? ఎక్కడుందో? అని ఎవరూ కనుక్కోలేదు, కలిసే ప్రయత్నమూ చెయ్యలేదు. తనకంటే పదిహేనేళ్ళు పెద్ద అత్త..

నాలుగేళ్ళ తనని ఎత్తుకుని " అత్తవడీ పూవువలె మెత్తనమ్మా' అని పాడినది గుర్తుంది..

అన్నాన్ని వెండి కంచంలో నెయ్యీ ఆవకాయ వేసి తను చెయ్యి కాల్చుకుంటూనే, ఆరబెట్టి తనకి పెట్టినదీ గుర్తుంది. కలిపేముందు ఎంత మంచి ఓణీ అయినా సరే దానితోనే తన పళ్ళెం తుడిచేది.

" అదేమిటే ? ఇన్ని తువ్వాళ్ళుండగా, బంగారం లాంటి ఓణీ ఎందుకు పాడుచేస్తావు?" అని నాన్నమ్మ అంటే. “అమ్మలు కంటే ఓణీ ఏమెక్కువ.. నా తర్వాత ఇదే మనింట్లో, మన యువరాణి” అని అనడం గుర్తుంది.

ఇరవైరెండేళ్ళ పోస్ట్ గ్రాడ్యుయేట్ తనక్కావలసిన వాణ్ణి, మనసుకి నచ్చినవాణ్ణి వెతుక్కోవడం తప్పయింది ఇంట్లో. తాతగారి పరువు, నాన్నా, పెద్దనాన్నల స్టేటస్, అమ్మ,పెద్దమ్మల హోదా అన్నీ పదిరెట్లు పడిపోయాయి.

" పెద్దదానివవుతున్నావ్ ఈ మాత్రం అర్ధం చేసుకోవూ" అన్నవారే " చిన్నపిల్లవి, జీవితం గురించి నీకేం తెలుసు?" అన్నారు.

" ఆ మత్తు దిగగానే నిన్ను రోడ్డు మీద పడేస్తాడు ' అన్నారు.

" వాడి హోదా ఏమిటి? మన అంతస్థేమిటి? అన్నారు.

"పాపిష్టిదానా, మా కంట పడకు ఇంకోసారి జీవితంలో" అన్నారు.

"మన ఊర్లోనే ఉంచి హాయిగా పెళ్ళి చేస్తే పోయేదానికి ఆ పట్నంలో పెట్టి చదువు చెప్పించారు. అదే ఇలా వెర్రితలలు వేసింది" అన్నారు

ఇంకా చాలా చాలా అన్నారు. ఆడవాళ్ళు గొడవచేశారు. మగవాళ్ళు బెదిరించారు. ఇవన్నీ చాలా కాలం వరకూ తెలియలేదు. తెలిసిందల్లా నాన్న అత్త మీద గట్టిగా అరవడమే. " ఇలాంటి తప్పుడూ పని మన ఇంటా వంటా లేదు పరువు తీసేశావు, చంపేస్తాను అనడమే".. అదీ పెద్ద అత్తద్వారా..

ఢిల్లీ లోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో పీ.హెచ్ డీ చేశాడు. తర్వాత రీసెర్చ్ కోసం అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీకి వెళ్తున్నాడు. కనీసం అతని చదువూ, సంస్కారం చూసైనా మనసు మార్చుకోమనంది. కానీ ఎవరూ వినలేదు.. పెద్దత్త చెప్పిన విషయాలివి.

" మీ నాన్నైతే మరీ, కనిపిస్తే దాని ప్రాణం తీసేస్తాడేమో అని నేనే ఇంట్లోంచి పంపేశాను" అని ఆవిడ చెప్పిన తీరు ఇప్పటికీ గుర్తుంది నాకు.

'కేవలం మన కులం కాదు, లేద మన హోదాకి తగరు అన్న విషయాలమీద ఎన్ని వందల జంటలు వేరవ్వవలసి వచ్చిందో అని తలుచుకుంటేనే బాధగా ఉంటుంది అమ్మలూ! అందుకే నేను దాన్ని ధైర్యం చేసి వెళ్ళిపోమన్నాను. అన్నానే కానీ ఆ తర్వాత నాకే భయం వేసింది సుమా. ఎక్కడుందో?ఏమైందో? ఎలా ఉందో? ఒక్క విషయం కూడా తెలీదు.

తప్పు చేసింది అనే అంటాడు మీ నాన్న ఇప్పటివరకూ. ఒక్కరోజు కూడా ఆయన అభిప్రాయంలో మార్పు లేదు. అందరికంటే ఆఖరుది, అల్లారు ముద్దుగా పెరిగింది. దాన్ని చూడాలన్న కోరికా లేదు ఇంట్లో ఎవ్వరికీ అని గట్టిగా చెప్పలేను. అందరూ మనసులో బాధపడేవారే. అక్కను కనక ఎక్కడో అక్కడ సుఖంగా ఉంటుందని అనుకుంటాను అంతే" అంది పెద్దత్త ..

అవన్నీ గుర్తొచ్చి ఏదో చెప్పలేని బాధ మనసులో సుళ్ళు తిరిగింది. ' అలరాస పుట్టిళ్ళ కాలం నాటినించీ ఇదే కధా? శుక్రవారం నేను చూడబోయేది అత్తనేనా? ఎలా ఉందో?

నా ఎనిమిదేళ్ళ వయసులో దూరమైన ఆమె ఇరవై రెండేళ్ళకి, ముప్పై సంవత్సరాలు కలిపితే వచ్చే రూపాన్ని ఊహించుకోవడానికి చేసే ప్రయత్నంలో ఎప్పుడో నిద్ర పట్టింది...

మర్నాడు గురువారం.. భారంగా గడిచాకా శుక్రవారం సాయంత్రం బయలుదేరాం ఒమాహాకి. సురేష్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్నాడు. రేఖ రాలేదు, వకుళని ఎక్కడికో తీసుకెళ్ళాలని..

రెండు గంటల ప్రయాణం తర్వాత ఊరికి బాగా దూరంగా ఒక మూల ఉన్న చిన్న బొమ్మరిల్లులాంటి ఇంటికి చేరాం. అక్కడున్న ఇళ్ళతో చూస్తే అతి సాధారణంగా, అత్యంత ప్రత్యేకంగా ఉందా ఇల్లు.

బెల్ కొట్టాడు సురేష్. నాలో అణువణువునా ఉద్వేగం. నెమ్మదిగా తెరుచుకున్న చప్పుడు, దాంతో పాటే వీచిన చందనపు పరిమళపు అగరువాసన.

" సందేహం లేదు"

" ఎంత గంధం తీస్తావే?చెక్క ఇప్పటికే అరిగిపోయింది" నాన్నమ్మ కేకలేసేది అత్తని..

" గంధం రంగు చీరంటే నీకెంత ఇష్టమో కదా" అమ్మ అనేది.

" పేరంటంలో గంధం నేను రాస్తాను" అత్త పోట్లాడి మరీ రాసేది.

" మైసూర్ సాండల్ సోప్ ఎంత బావుంటుందో, అన్నయ్యా నాకదే కావాలీ !! నాన్నని అడిగేది.. ఇప్పుడు ఎదురుగా నిలబడిన యభైరెండేళ్ళ ఆవిడ వంటి మీదనించి తేలివస్తున్న అదే మంచిగంధపు వాసన..

" అత్తా!" అన్నాను సంభ్రమంగా..

సురేష్ చిత్రంగా చూశాడు మా ఇద్దరి వైపు.

" అమ్మలూ, ఎలా ఉన్నావురా?" నోటిదాకా వచ్చిన మాటని అక్కడే ఆపి. హాయ్ సురేష్!! రండి రండి, " రామ్మా, రండి, రండి" అంటూ ఆహ్వానించింది. నన్ను కళ్ళనిండుగా చూస్తోంది.. నోట మాట రావడం లేదో, మాట్లాడడం మర్చిపోయిందో తెలీలేదు నాకు. లోపలకి పరిగెత్తినట్టు వెళ్ళి " మంచి నీళ్ళు" అంటూ వచ్చింది.

నన్ను తీసుకుని వచ్చిన సురేష్ ఆవిడనే చూస్తున్నాడు.

"కాఫీ తాగి మరో అరగంట తర్వాత అతను వెళ్ళిపోయాడు. మళ్ళీ రెండురోజుల తర్వాత ఫోన్ చేస్తే, వచ్చి తీసుకుని వెళతాను" అంటూ..

మీకు తెలిసిన ఆవిడ, ఈవిడే కదా! అన్నాడు. వెళ్ళేముందు

నేను అవునంటూ " రెండు రోజులు ఇక్కడే ఉంటాను అన్నాను. అదావిడకి మీరే చెప్పండి" అంటూ బాధ్యత అతని మీద పెట్టేశాను.

" ఏం చెప్పాడో మరి! , ఆవిడ చిన్నగా నవ్వుతూ తల ఊపడం చూసి హాయిగా నిట్టూర్చాను.

'నా ఎనిమిదేళ్ళకి ముప్పై కలిపితే ఉన్న ఈ ఆకారాన్ని అత్త గుర్తు పట్టిందా? 'అన్నది అనుమానం అందుకే ఈ జాగ్రత్త..

అతను వెళ్ళిపోయాకా ఎన్నో అడగాలి, ఎంతో మాట్లాడాలి అనుకున్నాను కానీ ఒక్కటీ కుదరలేదు. ఆవిడ నన్ను తప్పించుకుని తిరగడం నాకు తెలుస్తోంది. అవసరాన్ని మించిమాట్లాడకపోవడం ఇబ్బందిగా ఉంది. లివింగ్ రూం లో దండ వేసి ఉన్న నిలువెత్తు మగమనిషి ఫోటో నా కనుకొలకుల్లో కన్నీరుని నింపింది.

రెండు బెడ్ రూములూ, ఒక సన్ రూమూ ఉన్న చిన్న ఇల్లది. ఒక పాత కాలపు చిన్న కారు. పొద్దున్న లేస్తే, వంటా, సంగీతం,పుస్తకాలూ, వాలంటరీ సేవ.. ఇదే ఆవిడ దినచర్య..

తన కుటుంబాన్ని గురించి కానీ, తన అన్నావదినలగురించి కానీ, అక్క గురించి కానీ ఏమీ అడగలేదు ఆమె. నేను ఎన్నోరకాలుగా పలకరించాలని చూసినా నా ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. 'ఆ' ' ఊ' లాంటి పొడక్షరాలు తప్ప పెద్దగా మాటలూ లేవు. తను చేసే సేవా కార్యక్రమాల గురించి మాత్రమే ఆవిడ ఉత్సాహంగా చెప్పినది..

ఏం చెయ్యాలో తెలీలేదు. శనివారం రాత్రి కుక్కర్ ఒక పొయ్యి మీద పెట్టి పప్పు పులుసు పెడుతోంది. అది నా ప్రాణమని ఆవిడకి తెలుసు. గుర్తు పట్టినా, నాకు తెలియకూడదని జాగ్రత్త పడుతోంది..

కానీ నా ఇష్టాలనేమీ మర్చిపోలేదు. రాత్రి నా గదిలో నీలపు దుప్పటి వేసుంది.పక్కన గ్లాస్ లో మంచినీళ్ళు. పిప్పర్ మెంట్.. అది చూడగానే నాకొచ్చిన దు:ఖాన్నిమాటల్లో చెప్పలేను. చిన్నతనాన రోజూ అత్త పక్కనే పడుకునే నా అలవాట్లు ఆమెకొక్కదానికే తెలుసు. " పళ్ళు పాడవుతాయి పిప్పరమెంట్ తిని పళ్ళు తోముకోకపోతే" అని మరీ బ్రష్ చేయించేది నాతో.

ఇంక ఊరుకోవడం నావల్ల కాలేదు. ఏదో ఒకటి తేల్చుకోవాలి అనే నిర్ణయించుకున్నాను..

అందుకే చివరి అస్త్రంగా " అత్తలూ, ఆవకాయ అన్నం పెట్టవూ!! " వంటింటి గోడకి ఆనుకుని అడుగుతున్న నన్ను విప్పారిన కళ్ళతో చూసింది అత్త.. నువ్వు నన్ను అమ్మలూ అంటే నేను నిన్ను అత్తలూ అంటాను" అన్నానుట, అప్పటినించీ అత్తలే నాకు.

" అమ్మలూ!! మళ్ళీ అడుగు, ఏమన్నావు?ఇంకోసారి పిలు" అంది ఆవిడ..

" నేను పిలవడం సరే, నువ్వు ఏమని పిలిచావో అది చెప్పు. రెండు రోజులు పట్టిందా? ఈ మాటనడానికి!! ఇలా పిలవడానికి.. ఇన్ని గంటలు పట్టిందా? అన్నాను కినుకగా..

అప్పటికే అత్త కళ్ళల్లో నీళ్ళు.. ఇదీ అని చెప్పలేని భావంతో కురుస్తున్న కన్నీళ్ళు..

అధాట్టున వచ్చి నన్ను కౌగలించుకుంది.

తడిసిపోయాను ఇన్నాళ్ళూ దూరమైన ఆ ప్రేమలో,

ఒదిగిపోయాను చిన్నప్పుడు నన్ను అమ్మ తర్వాత అంతగా ప్రేమించిన ఆ మనసులో..

అమ్మలూ, అమ్మలూ.. అదొక్కటే వినిపిస్తోంది. అత్తొక్కర్తే కనిపిస్తోంది, ఆమె ప్రేమొక్కటే మనసుకి తెలుస్తోంది.

" ఎందుకు ఇన్నాళ్ళూ దాక్కున్నావు? ఎలా దాచుకున్నావు ఇంత ప్రేమ? ఇంత అభిమానం? ఎందుకు??" చెప్పు అన్నాను, కోపం, ఉక్రోషం నా గొంతులో

తెలీకుండానే నా కళ్ళల్లోనూ నీళ్ళు. నిన్నటినించీ తెలియకుండా మా ఇద్దరిమధ్యా నడుస్తున్న కనిపించకుండా నడుస్తున్న చిన్న మొహమాటానికో, మనసు మూగపోవడానికో తెర తొలిగిన ఫీలింగ్.. దాంతో పాటే వచ్చి చేరిన పాత చనువు..

నేను వచ్చిన ఈ రెండు రోజుల్లో అమ్మలూ అని పిలిచింది ఇప్పుడే కదూ!! అన్నాను మళ్ళీ.

" ఏవిటో అమ్మలూ! నిన్నిలా పెద్ద ఆఫీసర్ లా చూసేసరికి నాకు ఏదో తెలీని బెరుకు వేసింది నాకు.

" అదొక కారణమా? నీకు నా దగ్గర బెరుకా? అది కాదులే! అసలు విషయం నాకు తెలుసు.. నాన్న మీద కోపం నీకింకా తగ్గలేదు!!" అన్నాను.

అక్కడ తోమి బోర్లించిన వెండి కంచం చేతిలోకి తీసుకుంటూ " ముందు అన్నం పెట్టు అత్తలూ! ఆకలి" అన్నాను అల్లరిగా.

ఆరెంజ్ కలర్ బోర్డరున్న తెల్లటి చీర కట్టుకున్న అత్త నవ్వింది.. చీర కొంగుతో కళ్ళుతుడుకుంటుందనుకున్నా, కాదు నా కంచం తుడిచింది.. చిన్నప్పుడు ఓణీతో తుడిచేది, ఇప్పుడు చీరతో.

వెంటనే కూస్తున్న కుక్కర్ని గరిటె పెట్టి కొట్టి, నీళ్ళ కింద పెట్టి దాని నోరు మూయించి మూత తెరిచి వేడి అన్నం వెండి కంచం లో వేసి, నెయ్యి వేసి, ఆవకాయ వేసి కలిపింది. చెయ్యి ఎర్రగా కందిపోయింది అచ్చు చిన్నప్పటిలాగే.

" అత్తా! వేడి"చూసుకోవూ!! అన్నాను.

" పర్వాలేదురా! అంది అన్నం కలుపుతూ".. మరో నిమిషం లో అత్త కలిపిన ఆవకాయ అన్నం ఆస్వాదిస్తూ ఉండిపోయాను. అంది.

. "చెప్పత్తా, ఇన్నాళ్ళూ మేమెవ్వరమూ నీకు గుర్తు రాలేదూ? ఎలా ఉన్నావు? మావయ్యా ?.. అంటూ ఆగాను.

'అనుభవిస్తుంది..' ఇంట్లో ఆడవాళ్ళ మాటలు గుర్తొచ్చాయి..

" నాకేం? నేను బాగానే ఉన్నాను. నా ప్రపంచంలో నేను సుఖంగా.. నువ్వే పెద్ద ఆఫీసరువయ్యావు కదూ! ఇంట్లో అందరూ బాగున్నారా? మీ ఆయనేం చేస్తారు? పిల్లలు??" అంది..

వివరాలు చెప్పి అడిగాను " ఇంటికి వెళదాం వస్తావా?" అన్నాను ఆవిడ ఒళ్ళో ముడుచుకుని పడుకున్న క్షణానికి అడ్డుపడేవేవీ నాకు వద్దు అనిపించింది.

" రాను" స్థిరంగా అంది.

" అదేం? నాన్నమ్మ పెద్దదయిపోయింది, నాన్ననీ, బాబాయ్ నీ, పెద్దత్తనీ వాళ్ళనీ చూడాలని లేదూ?" అన్నాను..

" ఉంది..మనసంతా ఉంది, కానీ రాను.. వాళ్ళన్న మాటలు మర్చిపోలేను. నాకిక్కడేమీ తక్కువ లేదు, ఒక్క మీ మావ నన్ను వదిలి వెళ్ళిపోయారన్న బెంగ తప్ప. ఆయన లేకపోయినా ఆయన జ్ఞాపకాలెప్పుడూ నాతోనే ఉన్నాయి, ఉంటాయి.. నాకెవరూ అక్కరలేదు, ముఖ్యంగా నేను తప్పుడు పని చేశాను అని నిందించిన వాళ్ళు" అందావిడ కించిత్తు బాధగా.

గట్టిగానవ్వాను నేను. " సినిమాల్లో మాట్లాడుతున్నాననుకోకపోతే ఒక్క విషయం చెప్పనా? ఎంత హఠాత్తుగా కలిశామో మనం తలుచుకుంటేనే ఆశ్చర్యం వేస్తోంది కదూ.. నాన్న పైకి ఎప్పుడూ చెప్పరు కానీ ఆయన మనసు నాకు తెలుసు, అది బయటపెట్టలేని అహం తెలుసు. అలాగే పైకి చెప్పుకోలేక బాధపడుతున్న నాన్నమ్మ మనసూ తెలుసు. పెద్దత్త వల్లే నీ విషయం నాకు తెలుసు.. ఆవిడ నీ గురించి ఎంత బాధపడుతోందో నాకన్నా ఎవరికెక్కువ తెలుసు?" అందుకని నా మాట విని ఒక్కసారి , ఒకే, ఒక్కసారి ఇంటికి రా, అత్తా !! అన్నాను.

మాట్లాడ లేదు అత్త..

" మీ అందరి పేర్లంటే నాకెంత ఇష్టమో నీకు తెలుసు కదా!! ముఖ్యంగా నీ పేరు శుభ్రజ్యోత్స్న. తెల్లని వెన్నెల, జలతారు వెన్నెల, నువ్వు ఇంటికే వెన్నెల పంచే చందమామవు కావాలని తాతగారు ఆ పేరు పెట్టారుట. అలాగే పెరిగావు, అందరికీ ప్రేమని పంచావు. ఇప్పుడా వెన్నెలని ఇలా అడవిగాచినట్టు వృధా చెయ్యడం తగునా? చందమామకు గ్రహణం పట్టి దూరమయింది, ఇప్పుడా గ్రహణం వీడే సమయం వచ్చింది అత్తా!!

అందరి జీవితాల్లోనూ ఏవో సంఘటనలూంటాయి, కొన్ని ప్రయత్నపూర్వకంగా, మరికొన్ని అప్రయత్నంగానూ. ఇవీ అలాగే జరిగాయి. కొన్నాళ్ళు ప్రయత్నిస్తే పరిస్థితులు చక్కపడేవేమో మరి! నీకు చెప్పేంత దాన్ని కాదు కానీ ఇక్కడ ఒక్కదానివీ ఎందుకత్తా? మనింటికి వెళ్ళిపోదాం రా!! అన్నాను అభ్యర్థిస్తున్నట్టుగా..

అత్త ఆలోచిస్తోంది. ఊ అనలేదు, ఊహూ అనలేదు.

శుభ్రజ్యోత్స్న మా ఇంట్లో మళ్ళీ కుర్తుస్తుందో లేదో? అని నేను ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నాను.

COMMENTS